

ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

# ప్రగతి పథంలో ఖమ్మం జిల్లా

- 3.38 లక్షల రైతు కుటుంబాలకు రూ.2 లక్షల రుణమాఫీ
- 2.36 లక్షల మందికి 'గృహజ్యోతి'తో ఉచిత విద్యుత్ లబ్ధి
- ఖమ్మం స్వాతంత్ర్య వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జెండా వందనం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, కలెక్టర్, సీపీ

ఖమ్మం, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : దేశ స్వాతంత్ర్యోద్యమంలో వీర మరణం పొందిన మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని తమ ప్రభుత్వం పాలన అందిస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఖమ్మం జిల్లా ప్రగతి పథంలో పయనిస్తోందని స్పష్టం చేశారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్‌లతో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా అభివృద్ధిపై ఆయన ఉపన్యసించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని అన్నారు. అభివృద్ధిలో ఖమ్మం జిల్లా అగ్రగామిగా నిలుస్తోందని, దీనికి ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం, నిబద్ధతే ప్రధాన కారణమని అన్నారు. 1.58 కోట్ల మంది మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచి 15,307 మందికి మెరుగైన వైద్య సేవలు అందించామని తెలిపారు. త్వరలోనే ప్రతి నియోజకవర్గానికీ 3,500 ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో 3.94 లక్షల గ్యాస్ సిలిండర్లను రాయితీపై అందించామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం ద్వారా జిల్లా ప్రజలకు రూ.40 కోట్ల మేర లబ్ధి చేకూర్చామన్నారు. 3.38 లక్షల రైతులకు రూ.5,689 కోట్ల పంట రుణాలను మాఫీ చేశామని తెలిపారు. సీతారామ ప్రాజెక్టులో భాగంగా పాలేరు లింక్ కెనాల్ ద్వారా నూతనంగా 47,381 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ప్రక్రియను చేపట్టామన్నారు. ఏన్కూరు వద్ద రాజీవ్ లింక్ కెనాల్ నిర్మాణం చేపట్టి 7,115 ఎకరాల కొత్త ఆయకట్టుకు గోదావరి జలాలను అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇంకా మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, సంక్షేమ పథకాలు అందించామని వివరించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబ సభ్యులను సన్మానించారు. డీఎఫ్‌వో విక్రమ్ సింగ్, కేఎంసీ కమిషనర్ అభిషేక్, శిక్షణ కలెక్టర్ మిర్నల్‌శ్రేష్ఠ తదితరులు పాల్గొన్నారు. కాగా, జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉన్న నేపథ్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించకుండానే, ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలు అందించకుండానే డిప్యూటీ సీఎం వెళ్లిపోయారు. అనంతరం కలెక్టర్, సీపీ, జిల్లా అధికారులు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఉత్తమ అధికారులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందించారు. నృత్య ప్రదర్శనలు చేసిన చిన్నారులతో కలెక్టర్ ఫొటోలు దిగి వారిని అలరించారు. వివిధ శాఖల స్టాళ్లను సందర్శించారు.

# రెండేళ్లలో 'సీతారామ' పూర్తి

**నిరుద్యోగులకు ఇక ఏటా 60 వేల ఉద్యోగాలు**

**పెండింగ్ ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తాం**

**వైరా బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



వైరా సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

ఖమ్మం, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న సీతారామ ప్రాజెక్టును 2026, ఆగస్టు 15 నాటికి పూర్తి చేస్తామని, సాగునీరు అందించి రైతులకు అంకితం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గురువారం ఖమ్మం జిల్లా వైరాలో రూ.2 లక్షల రుణమాఫీని ప్రారంభించిన సీఎం.. తరువాత జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. రూ.2 లక్షల రైతుల రుణమాఫీకి సంబంధించి రూ.18 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని గుర్తు చేశారు. ఆమె కుమారుడు రాహుల్‌గాంధీ వరంగల్‌లో రైతు డిక్లరేషన్ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరఫున రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఆ ప్రకారమే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసిందని వివరించారు. ఇప్పటికే రెండు విడతలుగా రుణమాఫీ చేసిన తమ ప్రభుత్వం మూడో విడతగా రూ.2 లక్షలలోపు రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ చేసిందని వివరించారు. మొత్తం రూ.18 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. కేవలం 27 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రుణమాఫీ నగదు జమ చేయడం దేశంలోనే రికార్డు అని అన్నారు. తమ ప్రభుత్వం దళితులు, గిరిజనుల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తోందన్నారు. త్వరలో 4.50 లక్షల ఇళ్లను అర్హులైన పేదలకు ఇస్తామన్నారు. ఖమ్మం జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు.

## డోర్నకల్ వద్ద రిజర్వాయర్ నిర్మిస్తాం..

ఖమ్మం జిల్లా ప్రజలకు మున్నేరు నుంచి తాగునీటిని అందించేందుకు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ వద్ద 15 టీఎంసీల సామర్థ్యంతో వీరభద్రుడి పేరుతో రిజర్వాయర్‌ను నిర్మిస్తామని సీఎం ప్రకటించారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఎన్ని నిధులైనా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటికే 30వేల ఉద్యోగాలను ఇచ్చిందని, ఇక నుంచి ఏటా 60 వేల ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణపై సవతితల్లి ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. 8 మంది ఎంపీలను గెలుచుకొన్న ఆ ప్రభుత్వం ఈ రాష్ట్రానికి గాడిద గుడ్డు ఇచ్చిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో సీతారామ సహా ఎస్ఎల్‌బీసీ, పాలమూరు ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసే బాధ్యత తమదేనని అన్నారు. సభకు వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అధ్యక్షత వహించగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతలకు అండగా నిలుస్తాం

**వ్యవసాయ రంగ అభివృద్ధే లక్ష్యంగా మా ప్రభుత్వం పనిచేస్తోంది**

**జిల్లాలో 44,495 మంది రైతులకు రూ.269 కోట్ల రుణాలు మాఫీ..**

**భద్రాద్రి జిల్లా స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**





జాతీయ జెండా ఎగురవేస్తున్న మంత్రి తుమ్మల



కొత్తగూడెం టౌన్, ఆగస్టు 15:అన్నదాతకు అండగా నిలుస్తామని, వ్యవసాయ రంగ అభివద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరారవు పేర్కొన్నారు. సాగునీరు, ఉచిత విద్యుత్, రైతు భరోసా, రైతు బీమా, రుణ మాఫీ పథకాలతో పాటు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందిస్తున్నామని అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా భద్రాద్రి జిల్లా కేంద్రంలోని ప్రగతిమైదానంలో గురువారం జరిగిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తరువాత జిల్లా ప్రజలను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. 2024-25 వానకాలంలో రైతుభరోసా పథకంపై ఇంకా మార్గదర్శకాలు రావాల్సి ఉందన్నారు. రైతు బీమా కింద మరణించిన 645 మంది రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.32.25 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించామన్నారు. పంటల రుణమాఫీ పథకంలో భాగంగా 2024లో మొదటి విడత రూ.లక్ష వరకు 28,018 మంది రైతులకు రూ.132 కోట్లు, రెండో విడతలో రూ.1.50 లక్షల వరకు రుణం ఉన్న 16,377 మంది రైతులకు రూ.137 కోట్లు మాఫీ చేసినట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 44,495 మంది రైతులకు రూ.269 కోట్ల రుణాలను మాఫీ చేసి వారి ఖాతాల్లో సంబంధిత నగదును జమ చేశామని వివరించారు. గోదావరి జలాల సద్వినియోగంతో రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు అందించేందుకు రూ.13.58 వేల కోట్లతో సీతారామ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టామని అన్నారు. జిల్లాలో 6 వ్యవసాయ మార్కెట్ల పరిధిలో 34,650 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములు నిర్మించామని, నాబార్డ్ సహాయంతో రూ.36 కోట్లతో 60 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న 19 గోదాములు నిర్మించామని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలను అందించారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. బహుమతులు అందజేశారు. కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు



కొత్తగూడెం సింగరేణి: విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

# బీఆర్‌ఎస్ నేతల అక్రమ అరెస్టు

- రేగా, హరిప్రియలను వన్‌టౌన్ పీఎస్‌కు తరలించిన పోలీసులు
- కాపు సీతాలక్ష్మి, దిండిగాల రాజేందర్ సహా ఇతర నేతల అరెస్టు
- పోలీసుల వాహనాన్ని అడ్డుకున్న శ్రేణులు.. స్వల్ప ఉద్రిక్తత
- సీఎం పర్యటనను అడ్డుకుంటామన్న పిలుపుతో పోలీసుల దుశ్చర్య



మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును అడ్డుకుంటున్న పోలీసులు



రేగా కాంతారావును అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 15 : పినపాక, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, హరిప్రియ సహా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులను భద్రాద్రి జిల్లా పోలీసులు గురువారం అరెస్టు చేశారు. భద్రాద్రి జిల్లాలోని పినపాక నియోజకవర్గంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ఉద్యమ సారథి కేసీఆర్ నిర్మించిన సీతారామ ప్రాజెక్టు నీళ్లను పినపాక, ఇల్లెందు నియోజకవర్గాలకు; భద్రాద్రి జిల్లాలకు ఇవ్వకుండా ఖమ్మం జిల్లా మంత్రులు వారి నియోజకవర్గాలకు తరలించుకు వెళ్తుండడాన్ని నిరసిస్తూ రేగా కాంతారావు, హరిప్రియలు గురువారం ఆందోళనకు పిలుపునిచ్చిన విషయం విదితమే. భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీతారామ ప్రాజెక్టు రెండో పంపుహౌస్‌ను సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించనున్న నేపథ్యంలో ఆ ప్రారంభోత్సవాన్ని బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి వెళ్లి వీరు అడ్డుకుంటారేమోననే ఆలోచనతో భద్రాద్రి జిల్లా పోలీసులు గురువారం వీరిని ముందస్తు అరెస్టు చేశారు. బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రేగా కాంతారావు.. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం ఉదయం వేళ స్వాతంత్ర్య దినోత్సవ జెండాను ఎగురవేశారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న రేగా కాంతారావు, హరిప్రియ సహా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులను పోలీసులు అడ్డుకొని అక్రమంగా అరెస్టు చేశారు. తమనెందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పాలంటూ డీఎస్పీ రెహమాన్‌ను రేగా కాంతారావు, హరిప్రియానాయక్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన చేసే హక్కు లేదా అంటూ ప్రశ్నించారు. తాము శాంతియుతంగానే నిరసన చేసేందుకు వెళ్తున్నామని అన్నారు. తమను ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. అయినప్పటికీ వారి మాటలను పోలీసులు పట్టించుకోలేదు. అక్రమంగా అరెస్టు చేసి పోలీసు వాహనాల్లోకి ఎక్కించారు. ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియను మహిళా పోలీసులు ముందుకు నెట్టివేసి మరీ పోలీసు వాహనంలోకి ఎక్కించారు. అయితే, బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, నాయకుల అరెస్టుకు నిరసనగా పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసుల వాహనాలకు అడ్డుగా నిలుచొని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పార్టీ కార్యాలయం వద్ద కొంత ఉద్రిక్తత నెలకొంది. కార్యకర్తలను పోలీసులు నెట్టివేసి మాజీ ఎమ్మెల్యేలను, బీఆర్‌ఎస్ నేతలను కొత్తగూడెం వన్‌టౌన్, సుజాతనగర్ పోలీసుస్టేషన్లకు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, చుంచుపల్లి మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, బీఆర్‌ఎస్ నాయకులు తొగరు రాజశేఖర్, మోరె భాస్కర్‌రావు, సంకుబాపన అనుదీప్, సింధు తపస్వి, లకావత్ గిరిబాబు, లావుడ్యా సత్యనారాయణ, ముద్దంగుల కృష్ణ, లక్ష్మణ్, అన్నపునేని రమణ, ఆవుల నరసింహారావు, రామారావు, పోశెట్టి రవి, రామకోటి తదితరులు ఉన్నారు.

## ఇల్లెందులో ఎన్‌డీ నేతల అరెస్టు

ఇల్లెందు రూరల్, ఆగస్టు 15: సీతారామ ప్రాజెక్టు నీళ్లను ఇల్లెందు ఏజెన్సీకి ఇవ్వకుండా మైదాన ప్రాంతాలకు తరలించుకుపోతుండడాన్ని నిరసిస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతలు భద్రాద్రి జిల్లా ఇల్లెందులో గురువారం ఆందోళన చేపట్టారు. ఇల్లెందు ఏజెన్సీ వ్యవసాయ రంగానికి సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేస్తున్నారంటూ మండిపడ్డారు. అయితే అక్కడకు చేరుకున్న పోలీసులు.. నిరసనకారులను అరెస్టు చేశారు. ఎన్‌డీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అవునూరి మధు సహా ఆ పార్టీ నేతలు తుపాకుల నాగేశ్వరరావు, కొక్కు సారంగపాణి, నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు, తోడేటి నాగేశ్వరరావులను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.



మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్‌ను అరెస్టు చేస్తున్న మహిళా పోలీసులు



బీఆర్‌ఎస్ నాయకులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు



ఎన్డీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

# కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శం

**బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు**



బీఆర్‌ఎస్ కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న తాతా మధు

ఖమ్మం, అగస్టు 15 : పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంలో గత కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నగరంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించి ఎందరో త్యాగధనులను ఈ సందర్భంగా స్మరించుకోవాల్సిన అవసరం ఉందని, వారి కుటుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ తరఫున ఘన నివాళులర్పిస్తున్నామని అన్నారు. భారత రాజ్యాంగాన్ని నిర్మించే క్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రపంచానికి అత్యంత విలువైన రాజ్యాంగాన్ని అందించారని గుర్తు చేశారు. స్వాతంత్ర్య ఫలాలు అన్ని వర్గాలకు చేరాలంటే ఒక పటిష్టమైన రాజ్యాంగం ఉండాలని, రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించాలని గుర్తు చేశారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్ర ఏర్పాటు జరిగిందని, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాజ్యాంగానికి అనుగుణంగా 14 ఏళ్లపాటు పోరాటం చేసి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయకుమార్, మార్కెట్ మాజీ చైర్ పర్సన్ దొరేపల్లి శ్వేత, జిల్లా గ్రానైట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఉద్యమకారుడు ఉప్పల వెంకటరమణ, జిల్లా నాయకులు పొట్ల శ్రీను, మహ్మద్ రఫీ, భారతమ్మ, కిరణ్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్, చింతకాని మండల పార్టీ అధ్యక్షులు పెంట్యాల పుల్లయ్య, తిరుమలాయపాలెం మండల పార్టీ అధ్యక్షులు వీరన్న, ఉద్యమకారులు బొమ్మెర రామ్మూర్తి, బిచ్చాల తిరుమలరావు, లింగనబోయిన సతీష్, కోడిరెక్క ఉమా శంకర్, ఆసిఫ్, బురాన్, గ్లోరీ, గొట్టిముక్కల శ్రీను, దరిపెల్లి వీరబాబు, నాగుల్ మీరా, రాంబాబు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# కేసీఆర్ హయాంలోనే సంక్షేమ ఫలాలు

**బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు**



పార్టీ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండా ఎగుర వేస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 15 : గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందాయని బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో తొలుత తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అట్టడుగున ఉన్న ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందినప్పుడే నిజమైన స్వాతంత్ర్య వచ్చినట్లని అన్నారు. పేదల అభివృద్ధి కోసం గత కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పారదర్శకంగా, పకడ్బందీగా అమలు చేసిందని గుర్తు చేశారు. ఎందరో త్యాగధనుల పోరాటాలు, ఉద్యమాల వల్లనే మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందని, ప్రస్తుతం ఆ స్వాతంత్ర్య ఫలాలు ప్రతీ పేదవాడికి చేరాలంటే ప్రభుత్వాలు సమర్థవంతంగా పని చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, బీఆర్‌ఎస్ నాయకులు తొగరు రాజశేఖర్, మోరె భాస్కర్‌రావు, సంకుబాపన్ అనుదీప్, సింధు తపస్వి, లకావత్ గిరిబాబు, కొట్టి వెంకటేశ్వర్లు, లావుడ్యా సత్యనారాయణ, ముద్దంగుల కృష్ణ, లక్ష్మణ్, అన్నపునేని రమణ, ఆవుల నర్సింహారావు, రామారావు, పోశెట్టి రవి, రామకోటి, తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల త్యాగాలతోనే స్వాతంత్ర్యం

**భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్**



భద్రాచలం ఐటీడీఏ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఐటీడీఏ పీవో రాహుల్

బూర్గంపహాడ్ (భద్రాచలం), ఆగస్టు 15 : దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరుగకుండా.. అహర్నిశలు కృషి చేసి అసువులు బాసిన జాతిపిత మహాత్మా గాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వంటి మహనీయుల త్యాగాల ఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించిందని, ఆ స్వేచ్ఛా ఫలాలను మనం అనుభవిస్తున్నామని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. గురువారం 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను భద్రాచలం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో యూనిట్ అధికారుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన పీవో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. భారత సమాజం కోసం, స్వేచ్ఛ కోసం తిరుగుబాటు చేసిన త్యాగధనులు అల్లూరి సీతారామరాజు, కుమ్రంభీం వంటి వారు మనకు ఆదర్శప్రాయంగా ఉన్నారన్నారు. కాగా.. వేడుకల్లో భాగంగా వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బందికి పీవో ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, తానాజీ, దావూద్, ఎస్‌వో ఏడీ భాస్కర్, హెచ్ఎన్‌టీసీ ఉదయ్‌కుమార్, డీటీఆర్‌వోఎఫ్ఆర్ శ్రీనివాస్, ఏసీఎంవో రమణయ్య, ఏపీవో పవర్ మునీర్‌పాషా, ఏటీడీవో అశోక్, మేనేజర్ ఆదినారాయణ, జేడీఎం హరికృష్ణ, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.